ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

బుధవారం 01-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :14 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వాయిదా



2 లో

జులై 2న విడుదల అవకాశం

3.29 లక్షల మంది హాజరు

ఇంటర్ మార్కుల వెయిటేజీ ప్రభావం

సీబీఎస్ఈ ఫలితాల కోసం నిరీక్షణ

విద్యార్థులకు నష్టం లేకుండా నిర్ణయం

## ప్రభుత్వం రద్దు చేయమంటున్న హరీశ్ రావుకు డబుల్ మెంటలా?



2 లో

అసెంబ్లీ రద్దుపై సవాల్

కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు

దీపావళి బాంబుల వ్యాఖ్యలపై స్పందన

బీజేపీపై విమర్శల వర్షం

ఇందిరమ్మ ఇళ్లపై క్లారిటీ

రైతు భరోసా నిధులు త్వరలో

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే తక్షణమే అసెంబ్లీని రద్దు చేయాలన్న మాజీ మంత్రి హరీశ్ రావుకు మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. ప్రభుత్వం రద్దు అంటే హరీష్ రావుకు డబుల్ మెంటలా? అని ప్రశ్నించారు. ఈ రెండున్నరేళ్లలో ఏ ఎన్నిక పెట్టినా కాంగ్రెస్ గెలుస్తూ వస్తోందని.. అవి చూసి కూడా హరీష్ రావు పిచ్చి వ్యాఖ్యలు ఎందుకు? అని మండిపడ్డారు. ఇవాళ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన మంత్రి.. కేటీఆర్‌కు పిచ్చి పట్టిందని ఎంత వాగినా టైం చూసి మందు వేస్తామన్నారు.

**దీపావళి బాంబులపై కట్టుబడి ఉన్నా:** దీపావళి బాంబులపై నేను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ భారీ గుడ్ న్యూస్

ఉద్యోగులకు రూ.2,000 కోట్ల విడుదల

నెలలోనే రూ.4,000 కోట్ల చెల్లింపులు

పీఎఫ్, జీపీఎఫ్ బకాయిల క్లియరెన్స్

పెన్షనర్లకూ ఆర్థిక ఊరట

ఉద్యోగ సంఘాల హర్షం

పెండింగ్ బిల్లులకు గ్రీన్ సిగ్నల్

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం సోమవారం మరో రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేసింది.



2 లో

## రైతుభరోసాపై కేటీఆర్ ఫైర్

రూ.30 వేల కోట్ల బకాయిల ఆరోపణ

ఆశీర్వాద సభలపై విమర్శలు

రైతుల ద్రోహం మరిచిపోరని హెచ్చరిక

రుణమాఫీ అమలుపై ప్రశ్నలు

యూరియా కొరతపై ఆందోళన

రైతు వ్యతిరేక పాలన అంటూ విమర్శలు




2 లో

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం రాష్ట్ర రైతులకు పెద్ద ఎత్తున రైతుభరోసా నిధులు బాకీ పడిందని గడిచిన 30 నెలల పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిందే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులకు బకాయి పడిన రైతు భరోసా నిధులు, కాంగ్రెస్ ప్రభుత్వ ఎగవేతలపై ఇవాళ ఆయన స్పందించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా అని నిలదీశారు.

## మంత్రి పొన్నంకు

ఎంపీ రఘునందన్‌రావు ఘాటు కౌంటర్



2 లో

## కస్టోడియల్ డెత్ కేసు.. తెలంగాణ పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

డీజీపీ, సీఎస్‌కు నోటీసులు

మూడు వారాల్లో నివేదిక ఆదేశం

థర్డ్ డిగ్రీ ఆరోపణలపై విచారణ

దళిత యువకుడి మృతి కలకలం

బాధ్యులపై చర్యలకు డిమాండ్

2 లో

## జూలై 2న కీలక కేబినెట్



మధ్యాహ్నం 3 గంటలకు సమావేశంసీఎం

అధ్యక్షతన కీలక నిర్ణయాలు

అజెండాపై శాఖల కసరత్తు ముమ్మరం

నేడు నివేదికలు సమర్పించాలి

'నిల్' రిపోర్ట్‌కూ సీఎస్ ఆదేశం

హెడ్‌క్వార్టర్స్‌లోనే అధికారులంతా

సచివాలయంలో హై అలర్ట్ ఏర్పాట్లు

కీలక బిల్లులపై చర్చకు ఛాన్స్

సంక్షేమ పథకాలపై ఫోకస్

రాజకీయ, పరిపాలనా అంశాలపై మంతనం

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) అత్యవసర సమావేశం ఫిక్స్ అయింది. జూలై 2వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3:00 గంటలకు ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం 6వ అంతస్తులో గల కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

**అజెండాపై కసరత్తు.. నేటికల్లా నివేదికలు..**

కేబినెట్ భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు అజెండా రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, మరియు వివిధ శాఖల కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి, వాటిని తెలుగు అనువాదంతో సహా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలను నేడు మధ్యాహ్నం 1:00 గంటల కల్లా ఖచ్చితంగా పంపాలని సీఎస్ ఆదేశించారు. ఒకవేళ ఏ శాఖలోనైనా అజెండా అంశాలు లేనట్లయితే.. 'నిల్' రిపోర్టును కూడా నిర్ణీత సమయానికి అందించాలని స్పష్టం చేశారు.

మిగతాది 2 లో..

## భారత సైన్యానికి కొత్త బాస్

### 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్!

ఉపేంద్ర ద్వివేది స్థానంలో నియామకం

వైస్ చీఫ్ నుంచి ఆర్మీ చీఫ్‌గా

ఆర్మర్డ్ కోర్‌కు అరుదైన గౌరవం

నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం

విశిష్ట సేవలకు పలు పురస్కారాలు

ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి



2 లో

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** భారత సైన్యానికి కొత్త బాస్‌గా జనరల్ ధీరజ్ సేథ్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్మీ చీఫ్‌గా సేవలందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 31వ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు చేపట్టారు. ఈ అత్యున్నత బాధ్యతలను స్వీకరించడానికి ముందు ఆయన దేశానికి వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా సేవలందించారు. జనరల్ ధీరజ్ సేథ్ నియామకంతో భారత సైన్యంలో ఒక అరుదైన రికార్డ్ నమోదైంది.

## తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజు



2 లో

రామకృష్ణారావుకు వీడ్కోలు

1992 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్

ఉమ్మడి ఏపీలో కీలక సేవలు

కేంద్రం నుంచి రాష్ట్రానికి రాక

2029 ఫిబ్రవరి వరకు పదవీకాలం

## సింధూ జలాలపై పాక్ మంత్రి వ్యాఖ్యలు

### భారత్‌పై వివాదాస్పద హెచ్చరిక

జల వివాదం మళ్లీ తెరపైకి

ఒప్పందం నిలిపివేతపై ఆగ్రహం

నెటిజన్ల నుంచి తీవ్ర ట్రోలింగ్

'ఆపరేషన్ సిందూర్' ప్రస్తావన

పాక్ వ్యాఖ్యలపై విమర్శల వెల్లువ

సోషల్ మీడియాలో కౌంటర్ల వర్షం



2 లో

## మహిళా సాధికారతలో ఏపీ నంబర్-1



2 లో

99.7% రుణ లక్ష్యం పూర్తి

1.47 లక్షల మందికి రుణాల మంజూరు

రూ.1,495 కోట్ల ఆర్థిక సాయం

కేంద్రం నుంచి జాతీయ ప్రశంసలు

2026-27కు భారీ రుణ లక్ష్యం

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 01-07-2026

# తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజు



**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన మంగళవారం అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేటితో పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో సంజయ్ జాజును నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఉమ్మడి ఏపీలో కీలక బాధ్యతలు..

1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజుకు పరిపాలనా రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పలు కీలక పోస్టుల్లో బాధ్యతలు నిర్వర్తించారు. విజయవాడ సబ్ కలెక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, కమిషనర్‌గా సేవలు అందించారు. అలాగే పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా కూడా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి..

ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం, 2014 నుంచి సంజయ్ జాజు కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతున్నారు. కేంద్రంలో వివిధ కీలక శాఖల్లో తన మార్క్ చూపించిన ఆయన, తాజాగా తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టేందుకు తిరిగి రాష్ట్ర సర్వీసులోకి వచ్చారు. సీఎస్ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆయన ఈ పదవిలో ఉండనుండటంతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు, వేగం పుంజుకునే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు ఐఏఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ భారీ గుడ్ న్యూస్



**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం సోమవారం మరో రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి (ఆర్థిక శాఖ మంత్రి) మల్లు భట్టి విక్రమార్క సంయుక్తంగా జరిపిన సమీక్ష అనంతరం, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ నిధుల విడుదలకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

నెల వ్యవధిలోనే రూ.4,000 కోట్లు..

ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు, వారి న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిధులను విడతల వారీగా అన్‌లాక్ చేస్తోంది. ఇందులో భాగంగానే గత నెల 29న మొదటి విడత కింద రూ.2,000 కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నేడు మరో రూ. 2,000 కోట్లు విడుదల చేయడంతో.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ. 4,000 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించినట్లయింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పీఎఫ్, జీపీఎఫ్, సరెండర్ లీవ్లు, మెడికల్ బిల్లులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ నిధుల చెల్లింపులకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఈ ఆర్థిక ప్యాకేజీపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వం రద్దు చేయమంటున్న హరీశ్ రావుకు డబుల్ మెంటలా?

## మంత్రి పొంగులేటి కౌంటర్

**మొదటి పేజీ తరువాయి**



కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్లు కాదు ప్రజలు ఛీ కొట్టినా బాంబ్ పడ్డట్లేనన్నారు. మేము వేసిన బాంబులు కేటీఆర్ కు ఆల్రెడీ తగిలాయన్నారు. ఫారెస్ట్ ఏరియాల్లో ఒకప్పటి థ్రెట్ ఇప్పుడు లేదని అందుకే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు భద్రత తగ్గించారని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను కాంగ్రెస్ ఎందుకు చంపే ప్రయత్నం చేస్తామని ఆయనపై ఏమైనా ఉంటే అది బీఆర్ఎస్ వాళ్ళకే ఉంటుందన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు కాంగ్రెస్ చేయదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులకు సైతం భద్రత తగ్గించినట్లు వెల్లడించారు. తెలంగాణలో బీజేపీకి అధికారం అనేది దింపుడు కల్లం ఆశ అని కిషన్ రెడ్డి పగటి కలలు కనడం మానేయాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, కేబినెట్ లిస్ట్ తయారు చేసుకున్నట్లు అనుకుంటున్నారు. రూరల్ - అర్బన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి చూపించిందన్నారు.


వచ్చే ప్రభుత్వంలో సీఎం ఎవరో ఇప్పుడే చెప్పలేం:

ఈ ప్రభుత్వం మొత్తం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉంటారు. ప్రభుత్వంలో డీసీఎం భట్టి విక్రమార్క నంబర్ -2గా ఉంటారు. నాకున్న మంత్రి పదవితో సంతృప్తిగా ఉన్నానన్నారు. శాఖల మార్పుపై క్లారిటీ లేదని నాకు ఏ శాఖ ఇచ్చినా సంతృప్తిగా ఉంటానన్నారు. వచ్చే ప్రభుత్వంలో సీఎం ఎవరు అనేది ఇప్పుడే చెప్పలేం... కానీ అందరికంటే ముందు నేనే చెప్తానన్నారు. క్యాడర్ లో అందరూ సంతృప్తిగా ఉండలేరు.. కానీ అందరికీ న్యాయం చేస్తామన్నారు.

ఇందిరమ్మ స్లాబ్ విషయంపై..

ఇందిరమ్మ ఇండ్ల స్లాబ్ లెన్త్ పెంపు జీవోపై ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పందించారు. మేస్త్రి లాభం కోసం ఇళ్లకు నాలుగు వైపులా పెంచుతున్నారని స్లాబ్ పెంచడం వల్ల లబ్ధిదారులకే నష్టం అన్నారు. గ్రేటర్ సిటీలో పది అంతస్తుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తామని రెండు ఎకరాల్లో 8 టవర్లు నిర్మించే ఆలోచనలో ఉందన్నారు. సిటిలో 23 స్థలాలు 18 నియోజకవర్గల్లో వచ్చేలా ఫస్ట్ ఫేజ్ నిర్మాణం ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. వచ్చే కేబినెట్‌లో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. నవంబర్ లో జీహెచ్ఎంసీ ఎన్నికలు అనే చర్చ ఇప్పటికీ లేదని ఈసారి రైతు భరోసా లిమిట్ లేదని వారంలోపే 9వేల కోట్లు ఇస్తామన్నారు.

# కస్టోడియల్ డెత్ కేసు.. తెలంగాణ పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం




**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** కస్టోడియల్ డెత్ కేసులో తెలంగాణ పోలీసుల తీరుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన దళిత యువకుడు రాజేష్ కస్టడీ మరణం కేసును సుమోటోగా స్వీకరించిన కమిషన్, ఈ దారుణంపై సమగ్ర విచారణ జరిపి 3 వారాల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని తెలంగాణ డీజీపీ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

థర్డ్ డిగ్రీ చిత్రహింసల వల్లే మృతి..?

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులు, మానవ హక్కుల సంఘాల ఆరోపణల ప్రకారం.. దళిత యువకుడైన రాజేష్‌ను పోలీసులు ఎలాంటి పక్కా ఆధారాలు లేకుండా అక్రమంగా నిర్బంధించారు. విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌లో అతడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు ఉపయోగించారని, పోలీసుల దెబ్బలు తట్టుకోలేకే రాజేష్ కస్టడీలోనే ప్రాణాలు విడిచాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. లాకప్ డెత్‌కు కారణమైన బాధ్యులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌లు వస్తున్న నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణించింది. 3 వారాల గడువులోగా నివేదిక ఇవ్వని పక్షంలో తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని కమిషన్ పోలీసులకు స్పష్టం చేసింది.

# ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వాయిదా జులై 2న విడుదలయ్యే అవకాశం!

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న ఎప్‌సెట్ -2026 ఫలితాల విడుదల వాయిదా పడింది. సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఫలితాలను జులై 2న (గురువారం) ప్రకటించే అవకాశముంది.

మే 12 నుంచి 20 వరకు జరిగిన ఈ పరీక్షలకు సుమారు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1నే ఫలితాలు వెలువడాల్సి ఉంది. అయితే ఎప్‌సెట్ ర్యాంకింగ్‌లో ఇంటర్ మార్కులకు 25% వెయిటేజీ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, సీబీఎస్‌ఈ రివైజ్డ్ ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు వేచిచూడటం వల్లే ఎప్‌సెట్ ఫలితాల విడుదలలో జాప్యం జరిగినట్లు అధికారుల సమాచారం.

# భారత సైన్యానికి కొత్త బాస్..

## 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్!

**మొదటి పేజీ తరువాయి**

1997 తర్వాత ఆర్మర్డ్ కోర్ (టాంక్ రెజిమెంట్) విభాగం నుంచి భారత సైన్యాన్ని నడిపించే అత్యున్నత బాధ్యతను దక్కించుకున్న మొదటి అధికారి ఆయనే కావడం విశేషం.

1986 డిసెంబర్‌లో '2వ లాన్సర్స్' రెజిమెంట్‌లో కమిషన్డ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన జనరల్ ధీరజ్ సేథ్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ మిలిటరీ అనుభవం ఉంది. తన కెరీర్‌లో పాకిస్తాన్ సరిహద్దులతో ముడిపడి ఉన్న అత్యంత వ్యూహాత్మకమైన 'సదరన్ కమాండ్', 'సౌత్ వెస్ట్రన్ కమాండ్' రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా వ్యవహరించిన అరుదైన ఘనత ఆయన సొంతం. జమ్మూ కాశ్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్, ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల మిషన్‌లో పనిచేసిన ఆయన విశిష్ట సేవలకు గానూ పరమ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ యుద్ధ సేవా మెడల్ లభించాయి. సైన్యంలో ఆధునిక సాంకేతికత, డ్రోన్ల వినియోగాన్ని పెంచడం మరియు ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్ గ్రూప్స్ ల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# సింధూ జలాలపై పాక్ మంత్రి వ్యాఖ్యలు భారత్‌పై వివాదాస్పద హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** పాకిస్తాన్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ సింధూ నదీ జలాల ఒప్పందం వివాదంపై భారత్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్ తమ జల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. "పొరుగు దేశ ప్రధాని (నరేంద్ర మోడీ) చేతిలో ఒక టాప్ (నల్లా) ఉంది.. ఆయన పాకిస్తాన్‌కు చుక్క నీరు కూడా వెళ్లకుండా ఆపేస్తామంటున్నారు. ఒకవేళ ఎవరైనా మా నీటిపై చేయి వేయాలని చూస్తే, ఆ చేతులను నరికేస్తాం" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఈ 1960 నాటి ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం పై పాక్ మంత్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నక్క ఎంత అరిచినా పులి అవ్వదు - నెటిజన్ల ట్రోల్స్

పాక్ మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. "ఎంత అరిచినా నక్క ఎప్పటికీ పులి కాలేదు" అంటూ పాకిస్తాన్‌ను ఎద్దేవా చేస్తున్నారు. గతేడాది మే (2025) లో భారత్ ఉగ్రవాద స్థావరాలపై జరిపిన 'ఆపరేషన్ సిందూర్' ను గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం బ్రహ్మోస్, స్కాల్ప్ క్షిపణులతో పాక్ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాలను ఎలా ధ్వంసం చేసిందో, అప్పుడు పాక్ సైన్యం ఎలా చేతులెత్తేసిందో మర్చిపోయావా అంటూ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు నెటిజన్లు గట్టిగా కౌంటర్లు ఇస్తున్నారు.

## మంత్రి పొన్నంకు ఎంపీ రఘునందన్‌రావు ఘాటు కౌంటర్



**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను పూర్తిగా తిప్పికొట్టారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సరిపడా యూరియా కోటాను క్రమం తప్పకుండా పంపిస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో రైతులకు దానిని సక్రమంగా పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గతంలో ఢిల్లీలో ధర్నా చేసిన వ్యక్తి ఇప్పుడు ఎక్కడున్నారో అందరికీ తెలుసని, రేపు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎక్కడికి చేరుతుందో వేచి చూడాలంటూ ఎద్దేవా చేశారు.

మా అధ్యక్షుడు పరిగెత్తే యువకుడు..

కాంగ్రెస్ నాయకత్వంపై రఘునందన్‌రావు వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడ్డారు. తమ పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు నిరంతరం ప్రజల్లో ఉంటూ పరిగెత్తే యువ నాయకుడని కొనియాడారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఉద్దేశించి మాట్లాడుతూ.. "అక్కడ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒకసారి కూర్చుంటే కనీసం లేవలేని స్థితిలో ఉన్నారు" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ ఏకైక లక్ష్యమని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని రఘునందన్‌రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రైతుభరోసాపై కేటీఆర్ ఫైర్ రూ.30 వేల కోట్ల బకాయిల ఆరోపణ

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం రాష్ట్ర రైతులకు పెద్ద ఎత్తున రైతుభరోసా నిధులు బాకీ పడిందని గడిచిన 30 నెలల పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిందే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులకు బకాయి పడిన రైతు భరోసా నిధులు, కాంగ్రెస్ ప్రభుత్వ ఎగవేతలపై ఇవాళ ఆయన స్పందించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా అని నిలదీశారు.

శాపంలా వెంటాడటం ఖాయం

కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే అవుతుందన్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి 15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీచేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలన్నారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం అని హెచ్చరించారు.

అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు

ఇప్పటికే 50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారని, 72 సార్లు సీఎం ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్?లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారన్నారు. కేసీఆర్ టంచన్ గా 11 సార్లు, 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని, పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. రేవంత్ రెడ్డి ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని ఇది గుర్తుపెట్టుకోవాలన్నారు.

# మహిళా సాధికారతలో ఏపీ నంబర్-1

**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ మహిళా సాధికారత దిశగా మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. 2025--26 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు వ్యక్తిగత పారిశ్రామిక రుణాల పంపిణీలో 99.7 శాతం లక్ష్యాన్ని సాధించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం మహిళల ఆర్థిక స్వావలంబన, గ్రామీణ పారిశ్రామికీకరణలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ రాష్ట్రంగా గుర్తింపు పొందింది.

2025--26 ఆర్థిక సంవత్సరానికి మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.1,500 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.1,495.50 కోట్ల రుణాలను పంపిణీ చేసింది. మొత్తం 1.50 లక్షల మంది మహిళలకు రుణాలు అందించాలనే లక్ష్యంలో 1,47,840 మంది మహిళలకు వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు మంజూరు చేసింది. ఇదే సమయంలో 48,584 మంది మహిళలకు రుణాలు అందించిన తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు కూడా సమాన లక్ష్యాలు నిర్దేశించుకున్నప్పటికీ కేవలం 15 నుంచి 25 శాతం మాత్రమే సాధించగలిగాయి.

మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీలో అద్భుత పనితీరు కనబరిచిన నేపథ్యంలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి కూడా ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక లక్ష్యాన్ని కేంద్రం కేటాయించింది. వచ్చే ఏడాదిలో 1.67 లక్షల మంది మహిళలకు రూ.1,670 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2025--26లో ఈ పథకం ద్వారా 35,934 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పిస్తూ నిర్దేశించిన లక్ష్యంలో 95 శాతం సాధించింది. 35,210 మంది లబ్ధిదారులతో మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచింది.

రుణాల పంపిణీతో పాటు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలో కూడా ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని కేంద్రం ప్రశంసించింది. మహిళల ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కేంద్ర నివేదికలు వెల్లడించాయి. డ్వాక్రా మహిళలకు వ్యాపార నిర్వహణ, ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో సెర్ప్ ద్వారా ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నారు.

అలాగే డిజిటల్ మానిటరింగ్, ఎంఐఎస్ వ్యవస్థ, ఫీల్డ్ తనిఖీల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ మహిళలకు వేగంగా ఆర్థిక సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకుల సహకారంతో రుణాల పంపిణీ వేగవంతం కావడం కూడా ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. ఇక, ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలోనూ ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది. గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, కుటుంబాల ఆదాయాల పెంపులో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యంగా పేద, వెనుకబడిన వర్గాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో జాతీయ స్థాయిలో ఛాంపియన్‌గా నిలవడం రాష్ట్రానికి మరో గౌరవంగా మారింది.

## జూలై 2న కీలక కేబినెట్..మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

మంత్రిమండలి సమావేశం జరిగే సమయంలో ఎలాంటి పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కేబినెట్ సమావేశం ముగిసే వరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులందరూ ఖచ్చితంగా తమ ప్రధాన కార్యాలయాల్లో (హెడ్ క్వార్టర్స్) అందుబాటులో ఉండాలని సీఎస్ కె. రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు ఈ కీలక సమావేశానికి సంబంధించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రోటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, సచివాలయ బ్రాంచ్ టీజీటీఎస్ యూనిట్ మేనేజర్, ట్రాన్స్ లేషన్స్ డైరెక్టర్ లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, పరిపాలనాపరమైన పరిణామాలు, పలు కీలక బిల్లులు, ప్రజా సంక్షేమ పథకాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

# తెలంగాణ రైతులకు గుడ్‌న్యూస్.. రైతు భరోసా నిధులు విడుదల



**న్యూస్ డెస్క్, 30 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించే రైతుభరోసా ఆర్థికసాయం మంగళవారం శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్?రెడ్డి విడుదల చేశారు. మొదటిరోజు 41.37 లక్షల మంది రైతుల ఖాతాలోకి రూ.2482.02 కోట్లు జమ కానున్నాయి. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతుల కోసం రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72లక్షల మంది రైతుల కోసం రూ.1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సీజన్‌లో 73.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు దశలవారీగా పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయశాఖ తెలిపింది.

Registered No : APTEL/25/A/2818
ఇది కద నిజం
బుధవారం 01-07-2026

# ఓటరు నమోదులో ఆధార్, ఇ-సైన్ నిబంధనలను తొలగించాలి

## : సిఈఓకు టీపీసీసీ విజ్ఞప్తి



ఇది కద నిజం: తెలంగాణలో ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేసుకునేందుకు లేదా మ్యాపింగ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎన్నారైలు, వలస కార్మికులు, మరియు సాధారణ ఓటర్లు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ గారికి టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఇ-సైన్ తప్పనిసరి చేయడం, దానికోసం ఆధార్ అనుసంధానాన్ని అవసరం మార్చడం వల్ల పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్లు నమోదు చేసుకోలేకపోతున్నారని ఆయన సిఈఓ దృష్టికి తీసుకెళ్లారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు నమోదుకు ఆధార్ అనుసంధానం అనేది స్వచ్ఛందమే తప్పనిసరి కాదని, కానీ ప్రస్తుత ఆన్‌లైన్ విధానం ఈ సూత్రానికి విరుద్ధంగా ఉందన్నారు. విదేశాల్లో లేదా ఇతర ప్రాంతాలలో ఉండే చాలా మంది ఓటర్ల వద్ద చెల్లుబాటు అయ్యే భారతీయ పాస్‌పోర్ట్, వయస్సు, నివాస ధృవీకరణ పత్రాలు ఉన్నప్పటికీ ఆధార్ లింక్ కాకపోవడం లేదా విదేశాల్లో ఉన్నప్పుడు ఒటిపిలు రాకపోవడం వల్ల ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఓటరు నమోదు ప్రక్రియలో ఆధార్, ఇ-సైన్ బలవంతపు నిబంధనలను తొలగించి, పాస్‌పోర్ట్ మరియు ఇతర స్వీయ ధృవీకృత పత్రాలను జత చేసేలా వెసులుబాటు కల్పించాలని అయన కోరారు.

# చార్మినార్ నియోజకవర్గంలో ఘనంగా టిఆర్ఎస్ జెండా పండుగ




ఇది కద నిజం: చార్మినార్ నియోజకవర్గ పరిధిలోని పత్తర్ గట్టి డివిజన్‌తో పాటు హరిబౌలి డివిజన్ బేల, అశోక్ పిల్లర్ కూడలిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. చార్మినార్ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ సాయి మహేష్, చార్మినార్ అబ్జర్వర్ కందుల మధు ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో టిఆర్ఎస్, కవిత పాలన వచ్చేంతవరకు తాము నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కవిత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పాంచజన్యం' కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని వెల్లడించారు. తెలంగాణ నేతలలో ఆణిముత్యంగా వెలుగుతున్న కవితను ముఖ్యమంత్రిగా చూసేంతవరకు తమ పోరాటం ఆగదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాకుత్పురా అబ్జర్వర్ జ్యోతి కులకర్ణి, డేవిడ్, అనితా చౌదరి, మణికొండ విజయ్ కుమార్, రాజేష్, వికాస్, భాను, సంతోష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తొర్రూరు ఆర్టీసీ డిపోలో ఘనంగా చందసాని వీరస్వామి పదవీ విరమణ మహోత్సవం



ఇది కద నిజం న్యూస్ ,పర్వతగిరి , జూన్ 30 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం, వడ్లకొండ గ్రామానికి చెందిన చందసాని వీరస్వామి నేడు తొర్రూరు ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ గా పనిచేసి సుదీర్ఘ సేవల అనంతరం నేడు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. చందసాని వీరయ్యను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి ఘనంగా అభినందించారు. వారు మాట్లాడుతూ, చందసాని వీరయ్య ఆర్టీసీ సంస్థలో నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పాల్గొని చందసాని వీరస్వామికి శుభాకాంక్షలు తెలిపారు.

# దౌలత్ నగర్ లో తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి పరామర్శించిన వర్ధన్నపేట మ్మెల్యే కేఆర్.నాగరాజు



ఇది కద నిజం న్యూస్ ,పర్వతగిరి,జూన్ 30 : పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన దోనికేనా శ్రీనివాస్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం వారి నివాసానికి వెళ్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట జిల్లా,మండల,గ్రామ,ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పులుమామిడి శివాలయంలో వర్షాల కోసం ప్రత్యేక పూజలు



ఇది కద నిజం, పులుమామిడి: నవాబుపేట్ మండలం పులుమామిడి గ్రామంలోని అత్యంత పురాతనమైన శివాలయంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక జలాభిషేక పూజలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ నేపథ్యంలోనే స్వామివారికి ఈ ప్రత్యేక పూజలు తలపెట్టామని గ్రామస్తులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచే ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమానికి భక్తులు, రైతులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయంలోని శివలింగం పూర్తిగా మునిగేంత వరకు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన భజనలు, 'ఓం నమశ్శివాయ' నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. అభిషేకానంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భోళాశంకరుడిని వేడుకున్నట్లు భక్తులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా బి.శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేత ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన పూర్వపు ఆర్టీఓ వెంకన్న స్థానంలో నియామకం**

ఇది కద నిజం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన రవాణా శాఖ అధికారి (డి టి ఓ/ఆర్ టి ఓ)గా బి. శ్రీనివాస్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన జిల్లా నూతన సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛానికి బదులుగా ఒక మొక్కను అందించి, జిల్లాలో రవాణా శాఖ పరంగా తూచా తప్పకుండా బాధ్యతలు నిర్వహిస్తామని నివేదించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ,జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుదలకు, నిబంధనల అమలుకు కృషి చేయాలని సూచించారు.

పూర్వపు ఆర్టీఓ వెంకన్న ఆకస్మిక మృతితో ఖాళీ

భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్టీఓ వెంకన్న ఈ నెల (జూన్) 22వ తేదీన జరిగిన ఒక ఘోర లారీ ప్రమాదంలో దురదృష్టవశాత్తూ అక్కడికక్కడే మృతి చెందిన సంగతి విదితమే. ఆయన ఆకస్మిక మరణంతో జిల్లా రవాణా శాఖ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనవడమే కాకుండా, ఆర్టీఓ పోస్టు ఖాళీగా మారింది. అత్యంత కీలకమైన రవాణా శాఖలో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు,ప్రభుత్వం తక్షణమే స్పందించి బి. శ్రీనివాస్‌ను భూపాలపల్లి జిల్లా నూతన రవాణా అధికారిగా నియమిస్తూ అత్యవసర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

శాఖ పురోగతికి కృషి చేస్తా:డిటిఓ శ్రీనివాస్

ఈ సందర్భంగా నూతన రవాణా అధికారి బి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రమాద వశాత్తూ మరణించిన పూర్వపు అధికారి వెంకన్న ఆశయాలకు అనుగుణంగా,జిల్లాలో రవాణా శాఖను సమర్థవంతంగా నడిపిస్తానని అన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తామని,జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కార్యాలయ పరిపాలనా సిబ్బంది, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎం వీ ఐ),కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

# భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి 'ఎమ్మారై' సేవలు

**వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాస్పిటల్‌లో రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,కలెక్టర్ రాహుల్ శర్మ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం.. ఇకపై వరంగల్,హైదరాబాద్ వెళ్లే అవస్థలు తప్పినట్లే!**





ఇది కద నిజం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎమ్మారై మెషిన్‌ను మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ (వీడియో కాన్ఫరెన్స్) విధానంలో ఘనంగా ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్థానిక కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) గండ్ర సత్యనారాయణ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలు ముఖ్య అతిథులుగా హాజరై,ఎమ్మారై కేంద్రం వద్ద రిబ్బన్ కట్ చేసి ఈ సేవలను అధికారికంగా ప్రజలకు అంకితం చేశారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా ప్రజలకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గతంలో అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మారై స్కాన్ కోసం ఇక్కడి రోగులు వరంగల్ లేదా హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, వేలాది రూపాయలు ఖర్చు పెట్టలేక పేదలు ఇబ్బంది పడేవారని గుర్తుచేశారు. ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే అత్యాధునిక ఎమ్మారై మెషిన్ అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు సమయంతో పాటు ఆర్థిక భారం తప్పుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అధికారులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణ

అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఎమ్మారై సేవల నిర్వహణ నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన స్కానింగ్ నివేదికలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ నరేష్ లు ఎమ్మారై మెషిన్ పనితీరును, దాని ద్వారా రోగులకు చేకూరే లబ్ధిని ఎమ్మెల్యే మరియు కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్,ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్లు, ఎమ్మారై మిషన్ ఆపరేటర్లు, స్టాఫ్ నర్సులు, కో-ఆర్డినేటర్లు, హాస్పిటల్ నాల్గో తరగతి సిబ్బందితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఎమ్మారై మెషిన్ రావడం పట్ల జిల్లా ప్రజలు,రోగుల బంధువులు ప్రభుత్వానికి,స్థానిక ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్టేషన్ ఘనపూర్ విద్యా రంగానికి రూ.300 కోట్లతో బలోపేతం

**నెల రోజుల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

ఇది కద నిజం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూన్ 30

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యా రంగంపై భారీగా పెట్టుబడులు పెడుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గత రెండున్నరేళ్లలో నియోజకవర్గంలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డిగ్రీ కళాశాలల బలోపేతానికి దాదాపు రూ.300 కోట్ల నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. నెల రోజుల్లో స్టేషన్ ఘనపూర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ కూడా రాబోతుందని ప్రకటించారు. మంగళవారం చిల్పూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, తీగల తండా, రాజవరం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వెంకటేశ్వర్లపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, మరో రూ.10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం తీగల తండాలో రూ.7.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, మరో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అక్కడ కూడా నూతన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. తదనంతరం రాజవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.92 కోట్ల 55 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, ప్రహరీ గోడ తదితర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం చిల్పూర్ మండలానికి చెందిన 35 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.11.34 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, చిల్పూర్, వేలేరు మండలాలు కొత్తగా ఏర్పడిన వెంటనే అక్కడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు అవసరమని భావించి రెండు మండలాలకు కేజీబీవీలను మంజూరు చేయించడంతో పాటు, వాటి భవనాల నిర్మాణం కూడా పూర్తి చేయించినట్లు తెలిపారు. 2023లో తిరిగి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను సందర్శించి సమస్యలను గుర్తించి, రెండు విడతల్లో రూ.18.98 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై అపూర్వ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను దేశంలోనే విద్యా హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తాను విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో వరంగల్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. చేసే పనిపై



నిబద్ధత ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులదేనని, ప్రతి విద్యార్థిని సొంత బిడ్డలా భావించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. "విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులది..పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, స్థానిక సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీవో, కేజీబీవి స్పెషల్ ఆఫీసర్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్


## రవితేజ, శ్రీవిష్ణు కాంబోలో మల్టీస్టారర్ ప్రాజెక్ట్



గత కొద్ది కాలంగా ఇండస్ట్రీలో మల్టీస్టారర్ హవా కొనసాగుతోంది. స్టార్ హీరోలు బిగ్ స్క్రీన్‌పై కనిపిస్తే ఆ హంగామానే వేరు. ఇప్పుడు అలాంటి ఒక అదిరిపోయే కాంబినేషన్ సెట్ అయినట్లు టాక్. మాస్ మహారాజా రవితేజ, విలక్షణ నటుడు శ్రీవిష్ణు కలిసి ఒక భారీ మల్టీస్టారర్ సినిమాలో నటించబోతున్నారని పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఒకరిది ఊరమాస్ ఎనర్జీ అయితే, మరొకరిది డిఫరెంట్ టైమింగ్ అండ్ యాక్టింగ్ స్టైల్ అని చెప్పొచ్చు. వీరిద్దరి కలయికలో సినిమా అంటే పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ క్రేజీ మల్టీస్టారర్ చిత్రానికి 'రాజ రాజ చోర', 'శ్వాగ్' వంటి విభిన్నమైన వినోదాత్మక చిత్రాలను తెరకెక్కించిన టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి దర్శకత్వం వహించనున్నట్లు టాక్.

ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారట. దిల్ రాజు నిర్మాణంలో వస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీ వర్గాల్లో అప్పుడే మంచి బజ్ మొదలైంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. కథను పక్కాగా సిద్ధం చేసి, త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్ పైకి కూడా తీసుకెళ్లడానికి దర్శకుడు హసిత్ గోలి ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ సినిమాను సంక్రాంతి 2027 కానుకగా విడుదల చేయాలని మూవీ మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సీజన్‌కు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక ఈ సారి సంక్రాంతికి రవితేజ, శ్రీవిష్ణు లాంటి ఇద్దరు ఎనర్జిటిక్ హీరోల మల్టీస్టారర్ మూవీ రాబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ క్రియేట్ అయింది.

## దేవకన్యల మధ్య కామెడీ కింగ్




టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ వైవిధ్యమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ నటిస్తూ.. అందరి మెప్పు పొందుతున్నారు. ప్రస్తుతం వరుస చిత్రాలను లైన్‌లో పెట్టి ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఆయన కెరీర్‌లో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న 65వ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదలైంది. నేడు నరేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ సినిమాకు 'కామెడీ గోస్ కాస్మిక్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ పెట్టారు. సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో, కడుపుబ్బా నవ్వించే కామెడీ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని సరికొత్తగా రూపొందిస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని పెంచుతోంది.

ఇందులో అల్లరి నరేష్ ఒక స్టైలిష్ అవతారంలో, స్వర్గలోకపు మెట్లపై కూర్చుని కనిపిస్తున్నారు. ఆయన చేతిలో ఒక పెన్ను, అలాగే రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్నగ్రంథం ఉంది. దేవకన్యలు మేఘాల మధ్య ఆయన చుట్టూ తిరుగుతున్నట్లు ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. నరేష్ మార్క్ కామెడీతో పాటు, ఫాంటసీ ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఏ రేంజ్‌లో ఉండబోతున్నాయో ఈ పోస్టర్ హింట్ ఇస్తోంది. అయితే అల్లరి నరేష్ 'యముడికి మొగుడు' తర్వాత దాదాపు 14 ఏళ్ల విరామం అనంతరం ఫాంటసీ జానర్‌లో నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. భారీ బజ్ క్రియేట్ చేస్తున్న 'రంభ ఊర్వశి మేనక' చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దర్శకుడు చంద్రమోహన్ చింతాడ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నవ్వుల హంగామాను మరింత పెంచడానికి వెన్నెల కిషోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి ప్రముఖ హాస్యనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

## 'రణబాలి' విడుదల వాయిదా

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రణబాలి'. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అయితే ఈ చిత్రం 1854-1878 మధ్య కాలంలో బ్రిటీష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ పీరియాడి యాక్షన్ డ్రామా రూపొందుతోంది. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ నటిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. సౌత్ ఆఫ్రికన్ యాక్టర్ ఆర్నాల్డ్ వోస్లూ విలన్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నారు. అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమైంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను సెప్టెంబర్ 11న వినాయక చవితి పండుగ సందర్భంగా విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. విజయ్, రష్మిక క్రేజీ కాంబినేషన్ మళ్లీ వస్తుండటంతో అభిమానులు కూడా ఈ డేట్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.




అయితే, గత కొద్దిరోజులుగా ఈ సినిమా అనుకున్న సమయానికి రావడం లేదని, వాయిదా పడే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ వాయిదా వార్తలకు బలం చేకూరుస్తూ మైత్రీ మూవీ మేకర్స్ పెట్టిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే, గతంలో ఇచ్చిన పోస్టర్లలో సెప్టెంబర్ 11 రిలీజ్ డేట్‌ను స్పష్టంగా వేసిన మేకర్స్.. ఈ బర్త్‌డే పోస్టర్‌లో మాత్రం విడుదల తేదీని ఎక్కడా ప్రస్తావించలేదు. రిలీజ్ డేట్ మిస్ అవ్వడంతో సినిమా వాయిదా పడటం ఖాయమని, ఈ విషయాన్ని మేకర్స్ ఈ విధంగా హింట్ ఇచ్చారని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ వార్తతో విజయ్ దేవరకొండ, రష్మిక అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కొత్త విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## "ఆరుగురు ప్రతివ్రతలు" మళ్లీ వస్తున్నారు

2004లో విడుదలై ప్రేక్షకుల మనసు దోచుకున్న ఆరుగురు ఆరుగురు ప్రతివ్రతలు సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ కుమారుడు అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్రయూనిట్ సినిమా రీరిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ చిత్రానికి ఈవీవీ దర్శకత్వం వహించడంతో పాటు స్వయంగా నిర్మించారు. సినిమాలో ఎల్.బి శ్రీరామ్, శ్రీకృష్ణ, కౌశిక్ ప్రధాన పాత్రలో నటించారు. ఆరుగురు కలిసి చదువుకున్న మహిళలు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన తరవాత వారి జీవితాల గురించి చర్చించుకోవడం.. వారి జీవితంలో జరిగిన ట్విస్టులను చూపించడమే సినిమా.




ఈ చిత్రం అప్పట్లో మంచి విజయం సాధించగా ఇప్పటికీ టీవీలో వస్తే మిస్ కాకుండా చూసే అభిమానులు ఉన్నారు. అంతేకాకుండా తరచూ ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో మీమ్స్ దర్శనం ఇస్తూ ఉంటాయి. సినిమాలోని వీడియో క్లిప్స్ సైతం వైరల్ అవుతూనే ఉంటాయి. ముఖ్యంగా యూత్ ఎక్కువగా ఈ సినిమాకు కనెక్ట్ అయ్యారు. దీంతో రీరిలీజ్ చేయాలి అంటూ చాలా కాలంగా కోరుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు సినిమా రీరిలీజ్ అనౌన్స్ చేయడంతో అభిమానులు కుషీ అవుతున్నారు. అయితే త్వరలోనే విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారు కానీ విడుదల తేదీ మాత్రం ఇంకా అనౌన్స్ చేయలేదు.